క్లుప్తంగా

నాగార్పమ్మకు సామూహిక పొంగళ్లు



నాగర్పమ్మకు పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఓజిలి : ఓజిలి గ్రామ దేవత నాగార్పమ్మకు గ్రామస్తులు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టారు. మూడు రోజులు నుంచి అమ్మవారి తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం గ్రామస్తులు బోనాలు సమర్పించి సామూహిక పొంగళ్లు పెట్టారు. ప్రతి ఏటా పంట కోతలు ముగిసిన అనంతరం గ్రామ దేవతకు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఎన్నికల అనంతరం తిరునాళ్లు నిర్వహించాలని గ్రామస్తులు తీర్మానించారు. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి తిరునాళ్లు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మహిళలు ఇళ్ల నుంచి బోనాలు తీసుకుని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని సామూహిక పొంగళ్లు పెట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



నాయుడుపేట బీడీ కాలనీలో కార్డెన్ సెర్చ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ గోపి

నాయుడుపేట టౌన్ : గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం ఎస్ఐ గోపి, ఏఎస్ఐ ధర్మయ్య, సిబ్బందితో కలిసి నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏ సాగరం, బీడీ కాలనీలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. కాలనీలో అనుమానితులు ఎవరైనా ఉన్నారా, ఇళ్ల వద్ద ఉన్న వాహనాలకు రికార్డులు ఉన్నాయా తదితరాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి చేరినా, వారి కదలికలపై అనుమానాలు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. ఎన్నికల తరువాత ఎక్కడా వివాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సామరస్యంగా వ్యవహరించాలన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు తర్వాత కూడా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ర్యాలీలు, వేడుకలు, బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని వెల్లడించారు.



నాయుడుపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి

బెట్టింగులకు దిగితే కేసులు

వాకాడు : సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఎవరైనా బెట్టింగ్‌లకు దిగితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లకు పాల్పడినా, గొడవలకు దిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

హిందూ శ్మశానవాటికకు దాతలు చేయూత



రూ.50 వేలు అందజేస్తున్న విజయ్‌కుమార్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరం వద్ద ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు చేయూత ఇస్తున్నారని హిందూ ధర్మ సేవా సంఘం నాయకుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తోడకాటి విజయ్‌కుమార్ ఆదివారం శ్మశానవాటికలో అభివృద్ధి పనుల కోసం రూ.50 వేలు విరాళం ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక మంది దాతృత్వంతో శ్మశానవాటికలో పలు పనులు చేశామన్నారు. ఇక్కడ కర్మక్రియలు చేసుకునే వారికి వసతులు కల్పిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మునగాల కృష్ణారావు, పీడీ ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నాట్యం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నాట్య గురువు జ్యోతి శేఖర్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



చాగణం రహదారి



ఆదూరుపల్లి రోడ్డు

బాగుపడిన గ్రామీణ రోడ్లు

రోడ్లు ప్రగతికి బాటలు. రోడ్లు బాగుంటేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లు బాగుంటే రైతు పండించిన ఉత్పత్తులు సకాలంలో ఇతర ప్రాంతాలకు చేరవేయగలుగుతాడు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లలో గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేసి పల్లెలకు మెరుగైన రవాణా వ్యవస్థను తీసుకువచ్చింది.

- తీరిన ఏళ్లనాటి సమస్య
- నాలుగు రోడ్లకు రూ.9 కోట్లు ఖర్చు



రాగనరామాపురం రోడ్డు

సైదాపురం : వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో నాలుగు కొత్త రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. వాటితో చాగణం ఎన్‌పీఎస్ రహదారికి రూ.5.95 కోట్లు, జీఆర్ రోడ్డు నుంచి రాగనరామాపురం రోడ్డు వరకు రూ.1.24 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారి నుంచి పాలూరు వరకు రూ.89 లక్షలు, ఊటుకూరు నుంచి ఆదూరుపల్లి వరకు రూ.1.35 కోట్లతో రోడ్డు నిర్మించారు. పనులు కూడా శరవేగంగా చేపట్టి పూర్తి చేశారు. గతంలో ఈ రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు కొత్త రోడ్లు వేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సైదాపురం మండలంలోని ఎన్‌పీఎస్ నుంచి చాగణం వరకు ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ.5.92 కోట్లు మంజూరు చేయించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు



మా గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడేవాళ్లం. టీడీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోలేదు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. రహదారుల అభివృద్ధి లేదు. రోడ్ల దుస్థితిని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి తెలియజేయడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. పనులు కూడా పూర్తయ్యాయి. సంతోషంగా ఉంది.

– గుంటమడుగు శ్రీనివాసులురాజు, రాజులయర్రగుంటపాళ్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



గతంలో టీడీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పట్టికోలేదు. రోడ్ల దుస్థితిని గమనించిన వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి చాగణం ఎన్‌పీఎస్ రోడ్డుకు రూ.5.95 కోట్లు, జీఆర్‌రోడ్డు నుంచి రాగనరామాపురం రోడ్డుకు రూ.1.24 కోట్లు మంజూరు చేయించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పలు అభివృద్ధి పనులు జరిగాయి.

– మన్నారపు రవికుమార్ యాదవ్, సైదాపురం

భక్తిశ్రద్ధలతో ఘటం ప్రారంభం



ఘటంతో ప్రత్యేక పూజలు చేస్తున్న దేవదాయ శాఖ అధికారులు, నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఘటాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శెట్టిపల్లివారివీధిలో ఉన్న పోలేరమ్మ అలంకార మండపం వద్ద గ్రామపెద్దలతో పాటు విన్నమాల గ్రామానికి చెందిన పెద్ద కాపు అరవ భూమి శ్రీనివాసులురెడ్డి, ధీరజ్ రెడ్డి, స్థానిక దేవదాయశాఖ అధికారులు కలిసి పోలేరమ్మ ఘటానికి పూజలు చేశారు. అనంతరం పట్టణంలో ప్రతి ఇంటికీ తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి మడి బియ్యం, నగదు, కానుకలు తదితర ప్రసాదాలను అందించారు. అదే విధంగా కుమ్మరిమిట్టలో పోలేరమ్మ ప్రతిమను తయారు చేసే ప్రాంతానికి పెదకాపుతో పాటు గ్రామ పెద్దలు, జాతర నిర్వాహకులు వెళ్లి అక్కడ పోలేరమ్మను మట్టితో తయారు చేసిన రెండు ప్రతిమలను తిలకించారు. వీటిలో ఒకదాన్ని గుర్తించి తయారు చేయాలని కుమ్మరి అద్దంకి రవికి సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి శశాంక్, యుగంధర్, గ్రామ పెద్దలు ఆకులు కుబేరు మణి, రాగి శేషాగిరి, దేవత కిషోర్ శెట్టి, ఎస్ రామారావు, మార్కెట్ హరి యాదవ్, జాతర తంతును నిర్వహించే పలు వర్గాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు. అలాగే పోలేరమ్మ ఆలయం వద్ద అనేక మంది భక్తులు ఆదివారం నుంచే భక్తులకు అంబలి పోశారు.



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న పెద్దకాపు, ఆలయ అధికారులు



అంబలి అందజేస్తున్న భక్తులు,



ఘటం ఊరేగింపులో నిర్వాహకులు

కండలేరులో 6.678 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.678 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం

వెంకటగిరి(సైదాపురం): జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ర్యాలీలు, ఊరేగింపులను నిషేధిస్తున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బాణసంచా విక్రయాలు జరపరాదని పేర్కొన్నారు. ఎవరైనా టపాసులు విక్రయించినా, పేల్చినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు గొడలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని ప్రజలను కోరారు.

వంతెన నిర్మించాలని వినతి

సైదాపురం: పాలూరు -నిండలి మార్గంలోని కైవల్యానది వద్ద నూతన వంతెనను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరికి వెళ్లేందుకు ఈ మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా పంపారు. తెలుగు గంగ నీరు విడుదల చేసే సమయంలో ప్రవాహం పెరిగి వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు సమీపంలో ఉన్న పంట పొలాలకు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మెరుగ్గా ఆరోగ్యశ్రీ అమలు

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ వైద్య సేవలను మరింత మెరుగ్గా అమలు చేస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం ఆయన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎమర్జెన్సీ ఐసీయూ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేడియేషన్ థెరపీ, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి పనితీరు తెలుసుకున్నారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్‌తో ఆయన కలిసి స్విమ్స్‌తో పాటు రుయాలోని పలు వార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ టీం లీడర్స్ పురం శ్రీనివాసులు, సమాధి శ్రీనివాసులు, ఆరోగ్య మిత్రా పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రామ్, డాక్టర్ జయచంద్ర రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎండలను తాళలేక..

సైదాపురం : వేసవిలో భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం 10 గంటలకే ఎండ వేడి పెరుగుతోంది. దీనికితోడు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ క్రమంలో చిన్నారులు, యువకులు కుంటలు, బావులు, వంకల్లో ఉన్న కొద్దిపాటి నీటిలో ఈత కొడుతూ ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండ తగ్గేవరకు నీటిలోనే ఉంటున్నారు. మండలంలోని అన్నంరాజుపల్లి, దేవరవేమూరు, తురిమెర్ల, సైదాపురం గ్రామాల సమీపంలో ఉన్న వాగులో చిన్నారులు హాయిగా జలకాలాటలు ఆడుతున్నారు.



ఈతకొడుతున్న యువకులు

మోహినిగా అలరించిన కరిమాణిక్య స్వామి



గజ, సింహ వాహనాలపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామికి విశేష పూజలు చేశారు. స్వామి మోహిని అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి చప్పరంపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటి వద్దా స్వామికి గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి, కిషన్ స్వామి, టీటీడీ వేదపండితులు ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, సహస్ర నామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ నిర్వహించారు.



మోహినీ అలంకారంలో ఊరేగుతున్న స్వామి

కనుల పండువగా కల్యాణోత్సవం

శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి కల్యాణోత్సవం ఆదివారం అర్ధరాత్రి వరకు కనుల పండువగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు సింహ వాహనంపై, కరిమాణిక్య స్వామి గజ వాహనంపై అధిష్టించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపానికి తీసుకువచ్చి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో టీటీడీ ఆగమ పండితులతో పాటు టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుదీర్, హరిరెడ్డి, ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



ఉత్సవానికి సిద్ధమైన రథం

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. గతంలో మాజీ మంత్రి పసల పెంచలయ్య చొరవతో రూ.30 లక్షల పైగా ఖర్చు చేసి తీర్చిదిద్దిన 45 అడుగుల భారీ రథంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీరుస్తారు. రథోత్సవానికి నాయుడుపేట నుంచే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. భక్తులకు తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ తరపున యువత అన్నదానం చేస్తున్నట్టు కామిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు.



స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న ఆలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు

పేదలకు ఫల సరుకులు పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని పేదలకు ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫల సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బత్తల రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గున్నం సేవా ట్రస్టు ఆర్థిక సహకారంతో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు ప్రతి నెలా ఫల సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. గున్నం రెడ్డి మధుసూదన్‌రెడ్డి కర్ణాటక ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆర్థిక సహకారం అందించడంతో ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతోందన్నారు. దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ సంఘంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సనత్ కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులు రెడ్డి, క్రిష్ణారెడ్డి కిషోర్‌రెడ్డి, యద్దల అనీల్‌రెడ్డి, శివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థ ఆయన కుమారుడు మల్లికార్జున్ సహకారంతో 15 మంది పేద కుటుంబాల వారికి నెలకు సరిపడా 18 రకాల ఫల సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ప్రతినిధులు శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, రాధయ్య, ప్రభాకర్, వాచ్‌షాపు రాము, కుమార్‌నాయుడు, కేఆర్ఎం, శ్రీను, మునిప్రసాద్, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఫల సరుకులు పంపిణీ చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిదులు

రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలన ఖాయం

వరదయ్యపాళెం: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని ఆదివారం వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఆయన సతీమణి చైతన్య భాను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలన రావాలని కోరుతూ అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు అంతా మంచి జరగాలని వేడుకున్నట్లు వివరించారు. అదేవిధంగా వరదయ్యపాళెం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి శివాయాదవ్, కుటుంబ సభ్యులు నిర్వహించిన పూజలో నూకతోటి దంపతులు పాల్గొన్నారు.

చేదుగా మారిన మధుర ఫలం

- తగ్గిన మామిడి దిగుబడి
- పెరిగిన ధరలు
- కొనుగోలు చేయలేకపోతున్న సామాన్యులు



వ్యాపారాలు లేక వెలవెలపోతున్న పండ్ల దుకాణం

చిల్లకూరు : పళ్లలో రాజుగా పేరు పొందిన మధుర ఫలం మామిడి ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గింది. ధరలు పెరిగి తినేవాడికి చేదుగా మారింది. గత ఏడాది డిసెంబర్‌లో ఎక్కువగా మంచు కురవడంతో సకాలంలో మామిడి పూత రాలేదు. దీనికితోడు తేనెమంచు పురుగు విజృంభించింది. వర్షాలు కూడా సరైన సమయంలో కురవలేదు. దీంతో అరకొర దిగుబడి మాత్రమే వచ్చింది. గూడూరు నియోజకవర్గంలో సుమారు 5 వేల ఎకరాలకు పైగా మామిడిని సాగు చేస్తున్నారు. దిగుబడి తగ్గడంతో తోటలను లీజుకు తీసుకున్న వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నష్టాలను అధిగమించేందుకు బయటి నుంచి మామిడి కాయలు తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నారు. కోత కూలీలు, రవాణా చార్జీలు పెరిగిపోవడంతో ధరలు అమాంతం పెంచేశారు. దీంతో సామాన్యుడు మామిడి పండ్లు తినలేకుండా పోయింది. నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు ప్రాంతం మామిడి పండ్లకు ప్రసిద్ధి కావడంతో అక్కడి నుంచి పండ్లు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వ్యాపారులు 20 కేజీల ట్రే రూ.300లకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడికి తీసుకురావడానికి అదనంగా మరో రూ.50 ఖర్చవుతోంది. ఈ క్రమంలో కేజీ రూ.100 నుంచి రూ.120ల వరకు విక్రయిస్తున్నారు. గతంలో ఒక పండు రూ.5 లకు దొరికేది. నేడు రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. గతంలో ఒక కేజీ మామిడి పండ్లు రూ.60లకు దొరుకుతుండగా నేడు రూ.100 నుంచి రూ.120 వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులు ఒక కేజీ తీసుకుని వెళ్లి ఇంటిల్లిపాది సర్దుకుపోవాల్సి వస్తోంది.